క్లుప్తంగా...

సత్యానగర్‌లో తీరని నీటి కష్టాలు



నిరసన తెలుపుతున్న సత్యానగర్ వాసులు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట సత్యానగర్‌లో తాగునీటికి కష్టాలు తీరడం లేదు. గతంలో మూడు పర్యాయాలు నీటి సమస్యపై సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆదివారం స్థానిక మహిళలు రోడెక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాదాపుగా 25 ఇళ్లకు సరైన నీటి సరఫరా లేక మండుటెండలో నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోజు విడిచి రోజు వచ్చే నీరు సైతం రంగు మారి కలుషితమై వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నేతికార్ మహేశ్, సత్యానగర్ మహిళలు పాల్గొన్నారు.

ఆర్యనగర్ అభివృద్ధిని పట్టించుకోరా?



పనుల కోసం తవ్వి వదిలేసిన దృశ్యం

లాలాపేట: తార్నాక డివిజన్‌లోని ఆర్యనగర్ అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపడం లేదని ఆర్యనగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కుమార్ షాను ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీలో గత 8 ఏళ్ల నుంచి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేస్తున్నా ఇప్పటి వరకు పూర్తి కాలేదన్నారు. పాత కాలం నాటి డ్రైనేజీ పైపులైన్లు మార్చి వాటి స్థానంలో నూతన పైపులైన్ కోసం టెండర్లు సైతం ఖరారై నెలలు గడుస్తున్నా పనులు మాత్రం కావడం లేదన్నారు. త్వరలో వర్షాకాలం ప్రారంభం అవుతుందని రోడ్లు తవ్వడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు ఉండవు ఇక పైపులైన్ పనులు ఎప్పుడు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఎక్కడ చూసినా డ్రైనేజీ పొంగిపొర్లుతున్న పరిస్థితి ఉందన్నారు. ఓ వీధిలో పైపులైన్ పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేయడంతో వీధి గుండా రెండు నెలల నుంచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. ఆర్యనగర్‌కు జిమ్ సామగ్రి మంజూరు చేసి నెలలు గడుస్తుంది కానీ ఇప్పటి వరకు అవి అందుబాటులోకి రాలేదన్నారు.

విలీన ప్రక్రియకు పార్టీలకతీతంగా మద్దతు



పోస్టుకార్డు ఉద్యమంలో పాల్గొన్న సరిత, వికాస్ మంచ్ ప్రతినిధులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ ప్రాంతాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే విషయమై పార్టీలకతీతంగా మద్దతు లభిస్తోందని కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకీ రవీందర్ అన్నారు. ఆదివారం బోర్డు ఏడవ వార్డు చిన్న కమేళాలో బీఆర్‌ఎస్ వార్డు మహిళా అధ్యక్షురాలు నాగినేని సరిత సహకారంతో కంటోన్మెంట్ వికాస్ మంచ్ ఆధ్వర్యంలో ఆరవ విడత పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. రవీందర్ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ ప్రాంతాలను విలీనం చేసే అంశమై కంటోన్మెంట్ బోర్డు ప్రజల అభిప్రాయాలను తెలియపరుస్తూ పోస్టుకార్డులను రాసి ప్రధాని కార్యాలయానికి పంపుతున్నట్లు తెలిపారు. దశల వారీగా 50 వేల మంది అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వికాస్ మంచ్ అధ్యక్షులు గడ్డం ఏబెల్, సభ్యులు ప్రభుగుప్తా, అరుణ్‌యాదవ్, రాజేంద్రప్రసాద్, స్థానికులు జైప్రకాష్, మహేష్, రాజేష్, శివనారాయణ, విలియమ్, ప్రదీప్, జోసెఫ్, చరణ్, యాదన్న, వెంకటస్వామి పాల్గొన్నారు.

త్యాగరాయగానసభ వేదికపై ఉచితంగా మరో వివాహం

చిక్కడపల్లి: త్యాగరాయగానసభ ఆర్థికంగా వెనుకబడిన అన్ని కులాల వారికి ఉచితంగా గానసభ మందిరంలో అన్ని హంగులతో కూడిన కల్యాణవేదికతో పాటు ఇతర సౌకర్యాలు అందిస్తున్న విషయం విదితమే. ఆదివారం గానసభ అధ్యక్షులు కళా జనార్దనమూర్తి వివాహ పెద్దగా లావణ్య రాజుల వివాహం జరిపించారు. వివాహానికి అవసరమైన వెండి కాలిమెట్టెలు, బంగారు మాంగల్యం అందించడంతోపాటు భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. వధూవరులు జనార్దనమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్య సమాజ్.. సేవా కార్యక్రమాల్లో భేష్

- నిజాం వ్యతిరేక ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీలక పాత్ర
- పేద విద్యార్థులకు ఉచిత బోధన

బన్సీలాల్‌పేట్: భారతీయుల్లో తమ దేశం, ఆర్య ధర్మం, ఆర్య గ్రంథాల పట్ల భక్తి విశ్వాసాలు కల్పిస్తూ జాతిలో ఆత్మ విశ్వాసం పునరుజ్జీవింపజేసిన మహా పురుషుడు దయానంద సరస్వతి. నాటి గొప్ప చారిత్రక అవసరాన్ని గుర్తించిన స్వామి దయానంద సరస్వతీ ఆర్య సమాజాన్ని 1875లో స్థాపించారు. సకల సత్యాలకు, అత్యున్నత ఆధ్యాత్మిక విజ్ఞానానికి వేదాలే మూల స్తంభాలని, వేదాల పునాదులపై హైందవ పునః స్థాపన జరగాలని అభిలాషించిన వైదిక ధర్మ ప్రచారకుడు దయానందుడు. ఆర్య సమాజ్‌లు సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సమాజపురోభివృద్ధికి తమవంతు పాత్ర నిర్వహిస్తున్నారు. ఆర్య సమాజాలు ఇటీవలే ఆర్య సమాజ్ స్థాపన దినాన్ని ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ విమోచన కోసం, నాటి నిజాం హయాంలో ఆర్య సమాజ్ ప్రతినిధులు వీరోచితంగా పోరాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు, ఆందోళనలో ఆర్య సమాజ్ ప్రతినిధులు క్రియాశీలకమైన పాత్ర నిర్వహించారు. నాడు నిజాంపై బాంబు వేసిన నారాయణరావు పవార్ కూడా ఆర్య సమాజ్ ప్రతినిధే.

సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులో..

సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ఆర్య సమాజానికి ఎంతో చరిత్ర ఉంది. 1940లో దీన్ని స్థాపించి అప్పటి నుంచి నేటి వరకు అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ ఆర్య సమాజ్ ఏర్పాటుతో పాటు విస్తరణ కార్యకలాపాల కోసం లాలా మున్షీరామ్ దుసాజ్‌తో పాటు రామ్ రఖా, పండిట్ సోమనాథ్ శాస్త్రీ, బాల్‌రాజ్, పండిట్ నారాయణ స్వామి, బండారి సత్యనారాయణ, పండిట్ క్రిష్ణ స్వామి నాయుడులు ముఖ్య పాత్ర పోషించారు. పేదలకు విద్యా బోధనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలతో సమాజపురోభివృద్ధి కోసం తనవంతు పాత్ర నిర్వహిస్తూ ఆ దిశగా ముందుకు సాగుతుంది. ఈ ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ హిందీ మహావిద్యాలయ నర్సరీ నుంచి 7వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో నడిపిస్తున్నారు.



ఆర్పీ రోడ్డులోని ఆర్యసమాజ్ భవనం

సమాజహితం కోసం..



ఆర్య సమాజ్ సమాజహితం కోసం పనిచేస్తోంది. నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో సమాజ పురోభివృద్ధి దిశగా ఆర్య సమాజ్ అడుగులు వేస్తోంది. కుల, మత, జాతి విభేదాలకు అతీతంగా లోకకల్యాణం కోసం పాటు పడుతున్నాం.

–కంది విశ్వనాథం ఆర్యసమాజ్ మంత్రి

సేవల విస్తరణకు కృషి..



స్వామి దయానందుడు స్థాపించిన ఆర్య సమాజ్‌ను మరింత విస్తరించడానికి కృషి చేస్తున్నాం. సమాజానికి ఉపయోగపడే అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ వేదధర్మ ప్రచారాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. స్వామి దయానంద సరస్వతీ ఆశయాలు, ఆదర్శాలను సమాజంలోకి తీసుకెళ్లడానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

–మాశెట్టి శ్రీనివాస్ ఆర్య, సికింద్రాబాద్ ఆర్య సమాజ్ అధ్యక్షులు

సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న క్రిశాంక్

రసూల్‌పురా: ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం బాలంరాయిలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు బోర్డు మాజీ సభ్యులు బి. ప్రభాకర్‌తో కలిసి బస్తీనిద్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇప్పటివరకు తొమ్మిది బస్తీనిద్ర కార్యక్రమాలు పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు బస్తీనిద్ర కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఇళ్లపట్టాలు, వృద్ధాప్య, వితంతు పింఛన్లు మంజూరు చేయించాలని పలువురు కోరగా సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో సూరజ్, త్రివేద్, నవీన్, వెంకట్, బుచ్చి, మోని, రఘు, ఉదయ్, శివారెడ్డి, నాని, సాయిక రాజు, ఫహీమ్, యూనుస్ పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే 'బస్తీపోరు'



బస్తీ పోరులో మాట్లాడుతున్న ఆదం సంతోష్‌కుమార్

బౌద్ధనగర్: బస్తీల్లోని ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు బస్తీపోరు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆదం సంతోష్‌కుమార్ తెలిపారు. ఆదివారం బౌద్ధనగర్ డివిజన్‌లోని అశోక్‌నగర్‌లో చేపట్టిన బస్తీపోరు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో పదివేల డబుల్ బెడ్రూమ్‌లు నిర్మిస్తామని చెప్పి ఇప్పటి వరకు కేవలం 500 కూడా నిర్మించలేదని విమర్శించారు. అడ్డగుట్ట డివిజన్‌లో 40 ఏళ్లు దాటిన డ్రైనేజీ వ్యవస్థలో మార్పురాలేదని నాలాల ఆధునీకరణ జరుగలేదని, ఇంటర్, డిగ్రీ కాలేజీల ఏర్పాటు అయినా సొంత భవనాలు, కనీస వసతులు లేక విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని వాపోయారు. ప్రజాప్రతినిధుల ఆస్తులు పెరుగుతున్నా ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన జరుగడం లేదన్నారు. ట్రాఫిక్ సమస్య, శ్మశాన వాటికలో ఆక్రమణల తొలగింపు, కనీస వసతుల కల్పన ఏర్పాటు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదం సృజన్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు అనిల్, జయరాజ్, కరీం, సందీప్‌రాజ్, కార్తీక్, బబ్లూ, సతీస్, మహేందర్ పాల్గొన్నారు.

హమాలీల కూలీ రేట్లు పెంచాలి



హమాలీ యూనియన్ సమావేశం

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లోని హమాలీల కూలీ రేట్లు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. మోండా మార్కెట్‌లోని గ్రేస్ వర్తకుల సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు జరిగిన హమాలీ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేస్ మార్కెట్‌లో హమాలీలను రోజు 12 గంటల పాటు పనిచేయించుకుంటూ శ్రమకు తగ్గ కూలీ ఇవ్వడం లేదని ఆరోపించారు. చట్టప్రకారం హమాలీలకు ప్రతి సంవత్సరం రెండు జతల యూనిఫాం, మార్కెట్ కమిటీ నుంచి లైసెన్స్‌లు అందాల్సి ఉందని వాటి అమలు కోసం యూనియన్ తరఫున పోరాటం చేస్తామన్నారు. కూరగాయల విభాగంలో ఉన్నట్లుగా గ్రెయిన్ విభాగంలో పని చేస్తున్న హమాలీలకు కూడా హమాలీ చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. హమాలీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు హమాలీలు ఏఐటీయూసీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బెల్లపు రమేష్, మోటీ రవి, హత్కారి యాదగిరి, సిద్దులు, కుమార్, బొందయ్య పాల్గొన్నారు.

నెల్లి సత్యకు న్యాయం చేస్తాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పొలిటికల్ సైన్స్ విభాగంలో మొదటి ర్యాంక్ సాధించిన నెల్లి సత్యకు న్యాయం చేస్తామని అధికారులు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో మొదటి ర్యాంక్ సాధించిన సత్యకు సిద్ధిపేట డిగ్రీ కాలేజీలో సీటు కేటాయించడంపై స్టాడింగ్ కమిటీ సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. పొలిటికల్ సైన్స్ విభాగం అధ్యాపకుల సమన్వయ లోపంతో పీహెచ్‌డీ సీటు సిద్ధిపేటలో కేటాయించారని అందుకు ఓయూ పరిపాలన విభాగానికి సంబంధం లేదన్నారు. ప్రతి పీహెచ్‌డీ విద్యార్థికి న్యాయం చేస్తామని ఓయూ అధికారులు పేర్కొన్నారు.

పరిశోధన విద్యార్థుల సమష్టి విజయం..

ఓయూ పొలిటికల్ సైన్స్ విభాగంలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థి నెల్లి సత్య పీహెచ్‌డీ ఫీజుల పెంపు, ప్రవేటు రిసెర్చ్ సెంటర్లు ఏర్పాటు పై గత రెండు నెలలుగా పోరాడుతుండటంతో ఆయన పై అధికారులు కక్షగట్టారని పరిశోధన విద్యార్థులు పేర్కొన్నారు. ఆందోళనలు చేసే విద్యార్థులు ఓయూ క్యాంపస్‌లో ఉండకూడదనే సంకుచిత ఆలోచనతో సత్యకు ఆర్ట్స్ కాలేజీలో కేటాయించిన సీటును సిద్ధిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి బదిలీ చేశారని పరిశోధన విద్యార్థి ఆజాద్ పేర్కొన్నారు. అధికారులు తీసుకున్న తప్పుడు నిర్ణయంపై విద్యార్థులు పోరాట ఫలితంగా తిరిగి పీహెచ్‌డీ సీటును ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఇచ్చేల స్టాండింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయించడం సమష్టి విజయం అన్నారు. పీహెచ్‌డీ ఫీజు పెంపు, ప్రైవేటు రీసెర్చ్ సెంటర్ల రద్దు చేసే వరకు పోరాడుతామన్నారు.

పద్మారావునగర్‌లో నాయకుల పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న నాయకులు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు పర్యటించారు. సాయిబాబా దేవాలయం పరిసర ప్రాంతాల్లోని సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా స్థానికులు వారి దృష్టికి తీసుకువచ్చారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీహాల్ నిర్మాణం గురించి చర్చించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని స్థానికులు సహకరిస్తే పనులను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశన్, సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, హరిచారి, సాయి, తిరుపతి, నరసింహ, దుర్గా, అరుణ, శ్యామ్ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పించిన నాయకులు

లాలాపేట: దేశ మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశంలో సాంకేతిక విప్లవానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సురేష్‌లాల్, శ్రీనివాస్, నర్సింహ, ఎంఆర్ శ్రీనివాస్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగం ఉన్నతమైంది



రవికుమార్ దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

కంటోన్మెంట్: పోలీసు ఉద్యోగం అనేక సవాళ్లు, ఒత్తిడితో కూడుకున్నదని అయినప్పటికీ పీడిత, బాధితులకు అండగా ఉంటూ సామాజిక సేవ చేయడంలో బాధ్యత అని ఇన్‌స్పెక్టర్ రవికుమార్ అన్నారు. బదిలీపై వెళ్తున్న బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ కోనేరు రవికుమార్‌కు ఆదివారం సిబ్బంది వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులతో పాటు హాజరైన రవికుమార్‌ను ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. క్లిష్టమైన స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా విజయవంతంగా పనిచేయడంలో సిబ్బందితో స్థానిక ప్రజల సహకారం ఎంతో కీలకమన్నారు. నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కందుల రవికుమార్ మాట్లాడుతూ.. సిబ్బంది సహకారం, సమన్వయం ఉంటేనే పోలీసు ఉన్నతాధికారులు సమర్థవంతంగా పనిచేసే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐలు యుగంధర్, శివ శంకర్, నాగేందర్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యత స్వీకరణ..

రాంగోపాల్‌పేట్: గోపాలపురం ఇన్‌స్పెక్టర్‌గా మురళీధర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సాయి ఈశ్వర్‌గౌడ్ అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా కరణం మురళీధర్‌ను ఇక్కడికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం సాయి ఈశ్వర్‌గౌడ్‌కు తోటి సిబ్బందితో పాటు స్థానిక నాయకులు ఘనంగా వీడ్కోలు పలికి అలాగే బాధ్యతలు స్వీకరించిన మురళీధర్‌కు స్వాగతం పలికారు.

కుమారుడితో సహా తల్లి అదృశ్యం



రిషిక



ఆర్యన్

సికింద్రాబాద్: కుటుంబ గొడవల కారణంగా ఓ వివాహిత కుమారుడితో అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ హరీష్‌గౌడ్ కథనం ప్రకారం.. మైలార్‌గడ్డకు చెందిన సునీల్, రిషిక (35)భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు. సునీల్ ప్రైవేటు ఉద్యోగి కాగా రిషిక జలవిహార్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తోంది. కొన్ని నెలల క్రితం సునీల్ కుటుంబంతో కలిసి అహ్మదాబాద్‌లోని తన సోదరి ఇంటికి తీసుకెళ్లాడు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ నెల మొదటి వారంలో కుటుంబ సభ్యులతో అహ్మదాబాద్‌లో గొడవ పడగ రిషిక నగరానికి తిరిగి వచ్చింది. ఈ నెల 15న మరోమారు సునీల్‌తో గొడవ పడిన రిషిక చిన్న కుమారుడు ఆర్యన్ (05)ను వెంట తీసుకుని ఇంటి నుంచి వెళ్లి పోయింది. తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో సునీల్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న యువకులు

ఉత్సాహం.. సైక్లోథాన్..

సనత్‌నగర్: ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని జోయ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తపోటు అవగాహన కోసం జోయ్ సైక్లోథాన్ పేరిట ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వైద్యులు, వైద్య సిబ్బందితో పాటు యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అధిక రక్తపోటు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది రక్తపోటు సమస్యతో బాధపడుతున్నారన్నారు. గుండె జబ్బులు, స్ట్రోక్స్, ఇతర సమస్యలకు రక్తపోటు కారణమవుతుందన్నారు. ఆస్పత్రి సీఈఓ డాక్టర్ సంజయ్ తపాడియా మాట్లాడుతూ.. అధిక రక్తపోటును అదుపులో ఉంచుకునేందుకు అనేక మార్గాలు ఉన్నాయన్నారు. ప్రతిరోజూ వ్యాయామం, సరైన సమయంలో వైద్యులను సంప్రదించడం, క్రమం తప్పకుండా ఔషధాలు, పౌష్టికాహారం తీసుకోవడం, మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడం వంటి అలవాట్లతో రక్తపోటుకు దూరంగా ఉండవచ్చన్నారు. జోయ్ ఆస్పత్రి నుంచి ప్రారంభమైన సైకిల్ ర్యాలీ అమీర్‌పేట, పంజగుట్ట, ఎస్సార్‌నగర్ మార్గాల మీదుగా కొనసాగింది.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

కంటోన్మెంట్: ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలు పరిష్కరించడమే బీఆర్‌ఎస్ లక్ష్యమని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ ఐదో వార్డు గాంధీనగర్‌లో 'ఆత్మీయ పలకరింపు' పేరిట పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు ప్రజల మధ్య వెళ్లి ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రభుత్వం పథకాలు ప్రజలకు ఏ మేరకు అందుతున్నాయి, క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకోవడంతో పాటు మౌలిక సదుపాయాల లేమి తదితర అన్ని అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ప్రజాభిప్రాయం మేరకు ఆయా సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గంట రాజు, యాదగిరి, లింగయ్య, గుమ్మడి యాదగిరి, అశోక్, సత్యనారాయణ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రావుల సతీష్, నిత్య నగేష్ యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



గాంధీనగర్‌లో పర్యటిస్తున్న గజ్జెల నాగేశ్

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

సనత్‌నగర్: గుర్తుతెలియని ఓ మృతదేహాన్ని బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల ప్రకారం.. బేగంపేట బ్రూక్‌బాండ్ ఎక్స్‌రోడ్డు సమీపంలో ఫుట్‌పాత్‌పై అపస్మారక స్థితిలో ఓ వ్యక్తి పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా సదరు వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామని సంబంధీకులు ఉంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.



ఘనంగా జన్మదిన వేడుక



వేణుమాధవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

సికింద్రాబాద్: చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఆకాంక్ష క్యాటరర్స్ అధినేత అశ్వాపురం వేణుమాధవ్ జన్మదిన వేడుకలు ఆదివారం వారాసీగూడలో ఘనంగా జరిగాయి. వేదపండితులు పెరంబూదూర్ లక్ష్మీనర్సయ్య, ధర్మపురి శ్రీనివాస్, రాంగోపాల్, నందగోపాల్ పాల్గొని వేణుమాధవ్‌ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేణుమాధవ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలన్నారు. చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ప్రతినిధులు తులసీ జనార్దన్, ఆనంద్, ప్రభాకర్, నరసింహస్వామి, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

23న నటుడు చంద్రమోహన్‌కు పురస్కారం

చిక్కడపల్లి: విభిన్న పాత్రలు వేయికి పైగా సినిమాల్లో నటించిన ప్రముఖ నటుడు చంద్రమోహన్‌కు ప్రఖ్యాత నటుడు ఎన్.టీ.ఆర్, వంశీ పురస్కారం ఈ నెల 23న బహూకరిస్తున్నట్లు వంశీ ఇంటర్నేషనల్ అధినేత వంశీ రామరాజు విలేకరుల ఆదివారం తెలిపారు. చంద్రమోహన్ ఆరోగ్యకారణాల రీత్యా ఆయన స్వగృహంలోనే పురస్కారాన్ని బహూకరిస్తున్నట్లు వివరించారు. ముఖ్యఅతిథిగా సీబీఐ విశ్రాంత అ.డి కారి లక్ష్మీనారాయణ పాల్గొనగా.. సినీదర్శకుడు రేలంగి నరసింహారావు, రచయిత్రి జలంధర, న్యూస్ ప్రెసెంటర్ దేశాయ్ శ్రీదేవి, డాక్టర్ తెన్నేటి సుధ, శైలజలు హాజరుకానున్నారు.

